ఉష్ణోగ్రత మంగళవారం గరిష్ఠం : 31.0 కనిష్ఠం : 24.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

అనంతపురం

జిల్లా వార్తలు

బుధవారం 24 సెప్టెంబరు 2025



కొత్తూరు ఆలయంలో సామూహిక కుంకుమార్చనల్లో పాల్గొన్న భక్తులు



పాతూరు ఆలయంలో ఉత్సవమూర్తికి కాత్యాయనీదేవి, మూకాంబికాదేవి అలంకారం

పాహిమాం.. పరమేశ్వరీ..!

- శోభాయమానంగా నవరాత్రి ఉత్సవాలు
- ఆలయాల్లో ఆధ్యాత్మిక పరిమళాలు

నవరాత్రి ఉత్సవాలలో రెండో రోజు అమ్మవారు మహేశ్వరీదేవి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. అమ్మవారికి జిల్లా వ్యాప్తంగా ఆలయాలలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులను దర్శనానికి అనుమతించారు. ఆలయ ప్రాంగణాలలో సంగీత, నృత్య ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. అనంతపురం కొత్తూరు వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాత మూలవిరాట్‌ను రంగుల గాజులతో అలంకరించారు. ఆలయ ఆవరణలో ఉత్సవమూర్తులకు జయ, విజయ, శ్రీదేవి, భూదేవి సమేత అనంత పద్మనాభస్వామిగా అలంకరించారు. పాతూరులోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని ఫ్యాన్సీ బార్డర్లతో అలంకరించి, పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో అమ్మవారి ఉత్సవమూర్తిని కాత్యాయనిదేవి, మూకాంబికాదేవిగా అలంకరించారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం టౌన్



కొత్తూరు ఆలయంలో జయ, విజయ, శ్రీదేవి, భూదేవి సమేత అనంత పద్మనాభస్వామి అలంకరణ



పాతూరు అమ్మవారిశాలలో నృత్య నీరాజనం

ఆర్డీటీకి భయం లేదు



శాసనసభ వేదికగా ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు ప్రజా సమస్యలను లేవనెత్తారు. విద్యా, వైద్యానికి సంబంధించి తమ తమ నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలను అసెంబ్లీ దృష్టికి తీసుకువచ్చారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయించాలని ప్రజాప్రతినిధులు ముక్తకంఠంతో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వైద్య కళాశాలల విషయంలో వైసీపీ తీరును తీవ్రంగా ఖండించారు. గత ప్రభుత్వం చేసిన కక్షపూరిత చర్యల వల్ల నేటికీ అనేకమంది ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉన్నారని, ఆ తప్పులను సరిదిద్దాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

సేవలు కొనసాగుతాయి

- సీఎం మాటగా చెబుతున్నాం
- ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేల భరోసా
- మంత్రి లోకేశ్‌తో భేటీ.. ఆర్డీటీపై చర్చ
- అసెంబ్లీలో పలు సమస్యల ప్రస్తావన

అనంతపురం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ సేవలకు ఎటువంటి ఆటంకం ఉండబోదని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాటగా తాము చెబుతున్నామని ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు మంగళవారం స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఆయన కార్యాలయంలో మంత్రి సవిత, విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, సురేంద్రబాబు, గుమ్మనూరు జయరాం, దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్, ఎంఎస్ రాజు, బండారు శ్రావణిశ్రీ, పల్లె సింధూరారెడ్డి కలిశారు. ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ అంశంపై మంత్రి నారా లోకేశ్‌తో చర్చించారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరణ విషయంలో జిల్లా ప్రజలు ఆందోళన చెందుతున్నారని, చాలామంది రోడ్లెక్కి నిరసనలు తెలుపుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు నారా లోకేశ్ స్పందిస్తూ ఆర్డీటీని కాపాడటానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనిపై కేంద్రంతో నిరంతర సంప్రదింపులు జరుగుతున్నాయన్నారు. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు దీనిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. త్వరలోనే ఈ సమస్య పరిష్కారమవుతుందని హామీ ఇచ్చారు. లోకేశ్‌ను కలిసిన అనంతరం మంత్రి సవిత, కాలవ శ్రీనివాసులు మీడియాతో మాట్లాడుతూ ఆర్డీటీ సమస్య పరిష్కారానికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ జిల్లాకు ఆర్డీటీ అందిస్తున్న సేవలు అమూల్యమైనవన్నారు. అందుకే ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా



నారా లోకేశ్‌తో మంత్రి సవిత, ఎమ్మెల్యేలు

(మిగతా 6లో...)

వంట గ్యాస్ దందా

కర్ణాటక నుంచి అక్రమ రవాణా

- సిలిండర్‌పై రూ.228 అదనంగా వసూలు
- స్థానిక ఏజెన్సీల సేవా లోపమే కారణం





ఆటోలో ఉన్న కర్ణాటక గ్యాస్ సిలిండర్లు, ఓ దుకాణం ముందు ఉన్న కర్ణాటక సిలిండర్లు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో వంట గ్యాస్ సిలిండర్ల దందా జోరుగా సాగుతోంది. స్థానికంగా గ్యాస్ సరఫరాలో కొనసాగుతున్న లోపాలను ఆసరాగా చేసుకుని కొందరు కర్ణాటక నుంచి అక్రమంగా తెచ్చి అమ్ముతున్నారు. రూపనగుడి, బళ్లారి ప్రాంతల నుంచి రోజుకు 600 సిలిండర్లు మండలంలోకి వస్తున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.922 కాగా, కర్ణాటక సిలిండర్‌లకు రూ.1150 వసూలు చేస్తున్నారు. స్థానిక ఏజెన్సీలు సమయానికి సరఫరా చేయకపోవడంతో ప్రజలు రోజుల తరబడి వేచి చూడాల్సిన వస్తోంది. చివరకు బ్లాక్ మార్కెట్‌లో కర్ణాటక సిలిండర్లను అధిక ధరలకు కొంటున్నారు. మండల పరిధిలోని కురువళ్లి, చంద్రగిరి, సిద్ధరాంపురం, బొల్లనగుడ్డం తదితర గ్రామాలకు, ఓ ఫ్యాక్టరీకి సరిహద్దు అవతల నుంచి గ్యాస్ సిలిండర్లు వస్తున్నాయి. రూపనగుడివారితో దళారులు ఒప్పందం చేసుకుని, ఫ్యాక్టరీ సమీపంలోని చంద్రగిరి గ్రామానికి సిలిండర్లను తెప్పిస్తున్నారు. మండలంలో 12 వేలకు పైగా వంట గ్యాస్ కనెక్షన్‌లు ఉన్నాయి. దీంతో దందా భారీగా సాగుతోంది. ఇంత జరుగుతున్నా సివిల్ సప్లై శాఖ అధికారులు మౌనంగా ఉండటం అనుమానాలకు తావిస్తోంది. కర్నాటక నుంచి అక్రమంగా గ్యాస్ సిలిండర్లు తెస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దారు మునివేలు హెచ్చరించారు. స్థానిక ఏజెన్సీలు గ్యాస్‌ను సక్రమంగా సరఫరా చేసేలా ఆదేశాలు జారీ చేస్తామని అన్నారు. వినియోగదారులను విచారించి, ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని తెలిపారు.

నేడే అమరావతికి..

కొత్త టీచర్ల పయనం

ఉదయం పీవీకేకే కళాశాల నుంచి బయల్దేరనున్న బస్సులు

ఏర్పాట్లు పూర్తిచేసిన విద్యాశాఖాధికారులు

6

హత్య.. ఆత్మహత్య..!

- దంపతుల జీవితం విషాదాంతం
- దిక్కులేనివారైన ఇద్దరు కుమారులు







బిక్కుబిక్కుమంటూ చూస్తున్న పిల్లలు

ఆంజనేయులు, జ్యోత్స్న మృతదేహాలు

పదేళ్ల నుంచి అన్యోన్యంగా సాగుతున్న కాపురం. ఆ దంపతులకు రత్నాల్లాంటి ఇద్దరు కొడుకులు. ఇంతలో ఆ ఇద్దరి మధ్య అనుమానం అనే పెనుభూతం ప్రవేశించింది. తన భార్యకు మరొకరితో వివాహేతర సంబంధం ఉందని అతను ఆవేదనకు గురయ్యాడు. ఇద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయి. నమ్మకం లేని ఆ ఇంటిపై సీసీ కెమెరాల కన్ను నిఘా వేసింది. అయినా మునుపటి సఖ్యత కుదరలేదు. దసరా సెలవులు వచ్చాయి. మనవళ్ల కోసం తాతయ్య వచ్చారు. ఇద్దరినీ పండుగకు తీసుకెళ్లారు. ఆ తరువాత ఏం జరిగిందో తెలియదు..! దంపతులిద్దరూ ప్రాణాలన కోల్పోయారు. ఆమెను చంపేసి.. అతను ఉరి వేసుకున్నాడని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఇంతకు మించి ఏదైనా ఉంటే దర్యాప్తులో తేలుస్తామని అన్నారు. అలా ముగిసిపోయింది ఆంజనేయులు(36), జ్యోత్స్న(30) దంపతుల జీవితం. కానీ వారి ఇద్దరు కొడుకులు దిక్కులేనివారయ్యారు. ఈ విషాద సంఘటన తాడిపత్రి మండలం సజ్జలదిన్నె గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది.

(వివరాలు మెయిన్‌లో..)

కోనవిందు..!

దగ్గరలో పర్యాటక క్షేత్రం

ఆకట్టుకుంటున్న ప్రకృతి అందాలు (6లో..)



నకిలీ సంతకం

- ఉన్నతాధికారుల సంతకాలు ఫోర్జరీ
- రిటైర్మెంట్ బెనిఫిట్స్ థర్డ్ పార్టీకి వర్తించేలా అక్రమ మార్గం
- జలవనరుల శాఖ హెచ్చెల్సీ డివిజన్‌లో ఓ ఉద్యోగి బరితెగింపు
- అక్రమాన్ని గుర్తించిన పైఅధికారిపై దౌర్జన్యం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఫోర్జరీ సంతకాలతో తన ఉద్యోగ విరమణ ప్రయోజనాలను ఇతరులకు వర్తింపజేయాలని ఓ ఉద్యోగి ప్రయత్నించిన సంఘటన జలవనరుల శాఖ హెచ్చెల్సీ విభాగంలో జరిగింది. ఆ ఉద్యోగి తన సర్వీస్ రిజిస్టర్ (ఎస్‌ఆర్)ను అధికారుల అనుమతి లేకుండా ఇంటికి తీసుకెళ్లి అందులో నామినీగా ఉన్న భార్య పేరు స్థానంలో వేరే వ్యక్తి పేరు రాసి, గుట్టు చప్పుడు కాకుండా తెచ్చి మళ్లీ ఆఫీస్‌లో పెట్టేశాడు. ఆశాఖలో ఓ ఇంజనీరు, మరో ముగ్గురు ఉద్యోగులు ఈ తతంగానికి సహకరించినట్లు తెలిసింది. దాదాపు పది రోజుల కిందట జరిగిన ఈ వ్యవహారం ఆనోటా ఈనోటా ఇటీవల వెలుగు చూసింది.

ఘటన వెనుక ఓ ఇంజనీరు, ఉద్యోగులు

జలవనరుల శాఖ హెచ్చెల్సీలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగి మద్యానికి బానిసై విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని ఆశాఖలో చెబుతున్నారు. ఆయన వేధింపులు భరించలేక నాలుగేళ్ల కిందట భార్య ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. ఈక్రమంలో తన రిటైర్మెంట్ ప్రయోజనాలు థర్డ్‌పార్టీ (వేరేవ్యక్తి)కి వర్తింపచేయాలని భావించాడు. ఇందుకు తన ఎస్‌ఆర్‌లో మార్పులు చేయాలని ఆశాఖలో అధికారులను అడిగాడు. వారు నిరాకరించడంతో ఎస్‌ఆర్‌ను అనుమతి లేకుండా ఇంటికి తీసుకెళ్లి భార్యపేరు స్థానంలో వేరేవ్యక్తి పేరు రాశాడు. దానిపై హెచ్చెల్సీ ఎస్‌ఈ, డివిజన్ ఈఈతో పాటు ఇతర అధికారుల సంతకాలను ఫోర్జరీ చేశాడు. తర్వాత ఎస్‌ఆర్‌ను కార్యాలయంలో యథాతథంగా పెట్టేశారు. ఆ ఉద్యోగిపై అనుమానంతో డివిజన్ ఈఈ ఎస్‌ఆర్‌ను తెప్పించుకుని పరిశీలించారు. అందులో ఎస్‌ఈ, తాను చేయకపోయినా సంతకాలు ఉండటంతో ఉద్యోగిని ప్రశ్నించారు. అంతటితో ఆగకుండా విషయాన్ని ఎస్‌ఈకి చేరవేశారు. దీంతో అసలు విషయం బయటకు వచ్చింది. ఆ ఉద్యోగికి సంతకాలు ఫోర్జరీ, నామినీగా భార్యపేరు స్థానంలో వేరే వ్యక్తిపేరు నమోదు చేయించడంలో ఓ ఇంజనీరుతో పాటు మరో ముగ్గురు ఉద్యోగులు సహకరించినట్లు సమాచారం.



ఘటనపై ఇంజనీర్లు, అధికారులతో చర్చిస్తున్న హెచ్చెల్సీ ఎస్‌ఈ సుధాకర్

అధికారిపై దౌర్జన్యం

తన సంతకాల ఫోర్జరీ విషయాన్ని గుర్తించిన అధికారిపై ఆ ఉద్యోగి దౌర్జన్యానికి దిగినట్లు సమాచారం. ఎస్‌ఆర్‌లో తప్పుడు వివరాలు నమోదు చేసినట్లు గుర్తించి డివిజన్ ఈఈ విషయాన్ని ఆశాఖ ఎస్‌ఈ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎస్‌ఆర్‌ను పరిశీలించిన ఎస్‌ఈ, ఈఈలు తాము చేయకుండానే తమ సంతకాలు అందులోకి ఎలా వచ్చాయని ఆరా తీశారు. ఇదే విషయమై సంబంధిత శాఖ ఇంజనీర్లు, అధికారులతో చర్చించి క్రమశిక్షణా చర్యలకు ఆదేశారు. దీంతో ఫోర్జరీ తతంగాన్ని గుర్తించిన డివిజన్ అధికారిపై ఆ ఉద్యోగి తీవ్రస్థాయిలో దౌర్జన్యానికి దిగినట్లు సమాచారం.

మెమో జారీకి ఆదేశించా: సుధాకర్, హెచ్చెల్సీ ఎస్‌ఈ

ఎస్‌ఆర్‌లో ఉద్యోగి ఫోర్జరీ సంతకాలను డివిజన్ ఈఈ గుర్తించి నా దృష్టికి తెచ్చారు. ఘటనపై చర్చించి బాధ్యుడైన ఉద్యోగికి మెమో జారీ చేసి, క్రమశిక్షణా చర్యలకు తీసుకుంటాం. తప్పు చేసి మరీ తిరగబడటం సరికాదు. మెమో జారీ చేసిన తరువాత తదుపరి శాఖాపరమైన చర్యలపై చర్చించి నిర్ణయం తీసుకుంటాం. సంతకాలు ఫోర్జరీ చిన్న విషయం కాదు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినంగా వ్యవహరిస్తాం. ఇందులో రాజీపడే ప్రసక్తే లేదు.

యాడికి కాలువకు నీటి విడుదల



నీటి విడుదలను పరిశీలిస్తున్న జేసీ ప్రభాకర్ రెడ్డి

పెద్దవడుగూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం మీదుగా వెళ్లే పీఏబీఆర్ దక్షిణ కాలువ నుంచి యాడికి కాలువకు తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మంగళవారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా జలహారతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నార్త్‌కెనాల్ నుంచి 250క్యూసెక్కులు కిష్టిపాడు రెగ్యులేటర్ వద్దకు చేరి అక్కడి నుంచి మూడు భాగాలుగా విడిపోయి రాయలచెరువు, యాడికి కెనాల్, పెండేకల్లు రిజర్వాయర్‌కు చేరడం వల్ల భూగర్భజలాలు పెంపొందుతా యన్నారు. ఈ సందర్భంగా లస్కర్ వీరాంజనేయులును జేసీ ప్రభాకర్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ దివాకర్‌రెడ్డి, రాష్ట్ర ఆరె కటిక సంఘం ఛైర్మన్ హరికృష్ణారావు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, దస్తగిరి అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

కంది కళకళ

ఏపుగా పెరిగిన పైరు

తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం

సాగుకు మొగ్గు చూపుతున్న రైతులు



మరవకొమ్మ వద్ద కళకళలాడుతున్న కందిపంట

శింగనమల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగు చేసిన కంది పంట ఆశాజనంగా ఉంది. సమయానికి వర్షాలు కురుస్తుండటం తో పైరు ఏపుగా పెరుగుతోంది. మండలంలో వర్షాధారం కింద ఈ ఏడాది సుమారు 3 వేల ఎకరాల్లో రైతులు కంది పంట సాగుచేశారు. గతంలో వేరుశనగ పంటలో కందిని అంతర పంటగా సాగు చేసేవారు. అయితే వేరుశనగలో నష్టాన్ని తట్టుకోలేక చాలా మంది రైతులు కందినే ప్రధాన పంటగా ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తున్నారు. దిగుబడులు ఆశించిన స్థాయిలో ఉండటం, పంట నష్టం జరిగినప్పుడు వేరుశనగ కంటే కందికే ఎక్కువ ఇన్సూరెన్స్ వస్తుండటంతో గత నాలుగైదేళ్లుగా రైతులు ఈ పంట సాగుకే ఆసక్తి చూపుతున్నారు. కొంతమంది సొంత భూమిలోనే కాకుండా కౌలుకు తీసుకుని కూడా కంది పంట సాగు చేస్తున్నారు.

ఎప్పుడూ నష్టం రాలేదు: వడ్డే నెట్టికంటి, సి.బండమీదపల్లి



గత నాలుగు సంవత్సరాల నుంచి నాకు ఉన్న మూడు ఎకరాలలో కంది పంట సాగు చేస్తున్నా. మంచి దిగుబడులు వచ్చాయి. నా భూమితో పాటు మరికొంత భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నా. కంది పంట సాగు చేసినప్పటి నుంచి నాకు ఎప్పుడూ నష్టం రాలేదు. ఈ ఏడాది 30 ఎకరాల్లో కంది పంట సాగు చేశా. ప్రస్తుతం పంట పైరు ఆశాజనకంగా ఉంది. మార్కెట్‌లో గిట్టుబాటు ధర ఉంటే రైతుకు మరింత లాభదాయకంగా ఉంటుంది.

లక్షల్లో లాభాలు: కాయల జయరాముడు, సి.బండమీదపల్లి



నేను మూడేళ్లుగా నా సొంత భూమితో పాటు కొర్రపాడు సమీపంలో మరో 35 ఎకరాలను కౌలుకు చేస్తున్నా. గత మూడు సంవత్సరాల నుంచి పెట్టుబడులు పోగా లాభాలు లక్షల్లో వచ్చాయి. ఈ సారి కూడా కంది పంటను సాగు చేశాం పంట బాగానే ఉంది. ఈపంటకు పెట్టుబడులు తక్కువ. పంట పూత, పిందె సమయంలో పురుగుమందులు పిచికారీ చేసి కాపాడుకుంటే చాలు మంచి దిగుబడులు వస్తాయి.

మంచి ధర ఉంది: అన్వేష్‌కుమార్, వ్యవసాయాధికారి



పంట మార్పిడిలో భాగంగా ఎక్కువ మంది రైతులు కంది పంటను సాగు చేశారు. ఈపంటకు పూత, పిందె దశలో మాత్రం తెగుళ్ల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో రైతులు వ్యవసాయాధికారుల సూచనలు సలహాలతో సస్యరక్షణ చర్యలు పాటిస్తే మంచి దిగుబడులు వస్తాయి. గత నాలుగు సంవత్సరాల నుంచి మార్కెట్‌లో కందులకు మంచి గిట్టుబాటు ధర ఉంది.

మాతృమూర్తికి వందనం

● తల్లిపాలదాత లిఖితను సన్మానించిన తల్లులు



తల్లిపాల దాత దర్శి లిఖితను సన్మానిస్తున్న తల్లులు, మిల్క్‌బ్యాంక్ పర్యవేక్షకులు

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): తమ పిల్లలకు పాలు దానం చేసిన మీరే అసలైన మాతృమూర్తి అని దర్శి లిఖితను పలువురు తల్లులు సన్మానించారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని అనంత మదర్ మిల్క్ బ్యాంక్ కేంద్రంలో లిఖితకు మంగళవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మదర్ మిల్క్ బ్యాంక్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ హేమలత మాట్లాడుతూ నగరానికి చెందిన దర్శి లిఖిత బెంగళూరు ఎయిర్ పోర్టులో ఎలక్ట్రికల్ మేనేజర్‌గా పని చేస్తున్నారన్నారు. ఏప్రిల్ 30న బిడ్డకు జన్మనిచ్చిన ఆమె ఇప్పటి వరకు 45 నుంచి 50లీటర్ల తల్లి పాలను దానం చేశారన్నారు. లిఖితకు ప్రసూతి సెలవులు ముగియడంతో తిరిగి ఆమె విధుల్లోకి వెళ్తున్న సందర్భంగా సన్మాన సభను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. షబానా అనే విద్యార్థి తన పాకెట్ మనీతో ఫీడింగ్ బాటిల్స్‌ను దానం చేసిందని ప్రశంసించారు. కార్యక్రమంలో మిల్క్‌బ్యాంక్ నోడల్ ఆఫీసర్ భాస్కర్ నాయక్, న్యూట్రిషనిస్ట్ పల్లవి, కౌన్సిలర్ రాధ, స్టాఫ్‌నర్స్ రమ, కృష్ణ, శిశువుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ పీడితులకు వైద్యం చేయాలి

● కలెక్టర్ ఆనంద్



అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారందరికీ వైద్యం అందించాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారిని గుర్తించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. గుర్తించిన వారందరినీ ఏఆర్‌టీ కేంద్రాల్లో నమోదయ్యేలా చూసి, చికిత్స అందించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ ఈబీదేవి, జడ్పీ సీఈఓ శివశంకర్, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి జయలక్ష్మి, డీపీఓ నాగరాజునాయుడు, ఇన్‌చార్జ్ డీసీహెచ్‌ఎస్ ఎల్లప్ప పాల్గొన్నారు.

కోన విందు..!

దగ్గరలో పర్యాటక క్షేత్రం

ఆకట్టుకుంటున్న ప్రకృతి అందాలు




కనువిందు చేస్తున్న కోన జలపాతం

దసరా సెలవులు వచ్చాయి. ఎక్కువ దూరం వెళ్లకుండా.. ఉమ్మడి జిల్లా పరిధిలోనే ఆహ్లాదరక వాతావరణంలో ఒక్క రోజు గడిపేందుకు చాలా ప్రాంతాలు ఉన్నాయి. అలాంటి వాటిలో ఒకటి.. యాడికి మండలంలోని కోన రామలింగేశ్వర స్వామి క్షేత్రం. వర్షాకాలంలో జీవం పోసుకునే జలపాతం ఇక్కడి విశేషం. ఇప్పుడు జలజలా దూకి.. గలగల పారుతోంది. కోన చెరువు, కోనేరు, ఎకరం విస్తీర్ణంలో ఉన్న మర్రిచెట్టు.. దానికి వేలాడే ఊడలు, చుట్టూ పచ్చదనం.. అన్నీ కనువిందు చేస్తాయి. పెద్దగా వెలుగులోకి రాని కోన గుహలు కూడా ఈ ప్రాంతంలో చూడదగ్గ ప్రదేశం. దగ్గరికి వెళ్లేదాకా అక్కడ ఓ గుహ ఉన్నట్లే తెలియదు. కాస్త ధైర్యం చేసి లోపలికి వెళ్లితే.. కొంత దూరం వరకూ సెల్ ఫోన్ టార్చ్ వెలుగులలో అందాలను, ఆ లోపల చిన్నపాటి సెలయేటినీ చూడొచ్చు. క్షేత్రంలో కోన రామలింగేశ్వరుడిని దర్శించుకుని, ఉదయం నుంచి సాయంత్రం వరకూ హాయిగా గడపొచ్చు. యాడికి పట్టణం నుంచి 15 కి.మీ. దూరంలో ఉంటుంది ఈ ప్రాంతం. కానీ వాహన సౌకర్యం లేదు. యాడికి వరకూ బస్సులో వెళ్లొచ్చు. అక్కడి నుంచి సొంత వాహనం, లేదా అద్దె వాహనం ఏర్పాటు చేసుకోవాల్సిందే. వెంట తినడానికి ఏదో ఒకటి తీసుకెళ్లడం మరిచిపోవద్దు. ఆ నీటిలో ఆడుకుని, ప్రకృతి అందాలను తిలకిస్తూ.. పరవశించి పోయాక.. ఆకలి వేస్తుంది. అక్కడ ఏమీ దొరకదు. దగ్గరలో కోన ఉప్పలపాడు గ్రామం ఉంది. కానీ పల్లె టూరు. చిన్న చిన్న దుకాణాలు మాత్రమే ఉంటాయి. ఇంటిల్లిపాదీ వెళితే.. అక్కడే వంట చేసుకుని తినేందుకూ వీలుంది.


-ఆంధ్రజ్యోతి, యాడికి



కోన రామలింగేశ్వర స్వామి



కోన గుహల ప్రవేశ ద్వారం



కోన రామలింగేశ్వరస్వామి ఆలయం ముంగిట కొండల పైనుంచి వస్తున్న నీరు



అబ్బురపరిచే ఊడల మర్రి



ఆహ్లాదపరిచే కోన చెరువు



ఆలయం వద్ద కోనేటిలోకి పారుతున్న జలపాతం నీరు

ఆర్డీటీకి భయం లేదు

(5వ పేజీ తరువాయి)

తీసుకుందన్నారు. ఎమ్మెల్యే దగ్గుబాటి మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థని అడ్డుపెట్టుకొని వైసీపీ రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి మాట్లాడుతూ సేవ్ అనంతపురం, సేవ్ ఆర్డీటీ నినాదంతో జిల్లా ఎమ్మెల్యేలంతా ఏకతాటిపై ఉన్నామన్నారు. ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయించే బాధ్యత తమపై ఉందన్నారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మాట్లాడుతూ దశాబ్దాలుగా విద్య, వైద్యాన్ని పేదలకు అందిస్తున్న ఆర్డీటీని ప్రజాప్రతినిధులమంతా ఐక్యమత్యంతో కాపాడుకుంటామన్నారు. వైసీపీ నేతలు రాజకీయ ఉనికి కోసమే ఆర్డీటీ అంశాన్ని వాడుకుంటున్నారని విమర్శించారు. మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ గత 56 సంవత్సరాలుగా ఆర్డీటీ అనేక సేవ కార్యక్రమాలు చేస్తోందన్నారు. పేదలకు గృహ నిర్మాణం, విద్య, వైద్యం ఉచితంగా అందిస్తోందన్నారు. రైతులకు పండ్ల మొక్కలు అందజేస్తూ హార్టికల్చర్ అభివృద్ధికి పాటుపడుతోందని వెల్లడించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4వేల గ్రామాల్లో ఎంతో మందికి ఆర్డీటీ సేవలు అందిస్తోందన్నారు. అలాగే 30 సంవత్సరాల పోరాటం అనంతరం చంద్రబాబు చేతుల మీదుగా ఎస్సీ వర్గీకరణ జరగడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లు ఇప్పటికే కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నారని ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని విజ్ఞప్తి చేశారు.

శాపంగా వైసీపీ

కక్షపూరిత చర్యలు

● ఎమ్మెల్యే పరిటాల సునీత



వైసీపీ పాలనలో అనుసరించిన కక్షపూరిత చర్యలతో నేటికీ అర్హులైన ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందడం లేదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆవేదన వ్యక్తం చేశారు. తప్పులను సరిచేసి, అర్హులందరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మంగళవారం ఆమె జీరో అవర్‌లో మాట్లాడారు. కొత్తగా ఇస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో కక్షపూరితంగా టీడీపీ సానుభూతిపరుల రేషన్‌కార్డులు, పెన్షన్లు తొలగించారన్నారు. ప్రభుత్వ పథకాలన్నింటికి రేషన్‌కార్డులు ప్రామాణికం కావడం వల్ల చాలా మందికి లబ్ధి చేకూరలేదన్నారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్ విషయంలో గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులు, గ్రామ వలంటీర్లు చేసిన పొరపాట్ల వల్ల అనేక సమస్యలు వచ్చాయన్నారు. కుటుంబ సభ్యుల వివరాలు సరిగ్గా నమోదు కాకపోవడం, ప్రభుత్వ ఉద్యోగం పొందిన వారు తల్లిదండ్రులతో కాకుండా వేరుగా ఉన్నా అవి నమోదు చేయకపోవడం, విద్యుత్ బిల్లులు ఎక్కువగా చూపి వాటిని సరిచేయకపోవడం వంటివి జరిగాయన్నారు. వాటన్నింటిని తక్షణమే సరి చేయాలని కోరారు.

వైద్య విద్య పాపం వైసీపీదే: కాలవ



అనంతపురం క్రైం/రాయదుర్గం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు ఉచితంగా అందాల్సిన వైద్యవిద్యను ఖరీదైనదిగా మార్చిన పాపం గత వైసీపీ ప్రభుత్వానిదేనని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. అసెంబ్లీలో మంగళవారం ఆయన వైద్యరంగంపై మాట్లాడారు. పేదలకు అందాల్సిన సీట్లను ఎన్నారై, ఇతర కోటా పేరుతో రూ.20 లక్షలు, రూ.12 లక్షలకు పెంచినది నిజం కాదా అని ఆయన ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో 17 మెడికల్ కాలేజీలు ప్రారంభించినట్లు గొప్పలు చెబుతున్నారని, అయితే నేటికీ పునాది, మొండి గోడలకే పరిమితమైన వాటిని చూసి వైసీపీ నాయకులు సిగ్గుపడాలన్నారు. వివిధ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాలల ఫొటోలు అసెంబ్లీలో చూపుతూ వైసీపీ తీరును ఎండగట్టారు. ఐదేళ్లలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి, అన్ని రంగాల్లో విధ్వంసం సృష్టించారంటూ ఫైర్ అయ్యారు. ఉమ్మడి ఏపీలో సీఎం చంద్రబాబు 17 మెడికల్ కాలేజీలు ప్రారంభిస్తే... అందులో ఆరు ప్రభుత్వ రంగంలోనే ఉన్నాయన్నారు. అత్యంత వెనుకబడిన అనంతపురంలో సైతం 2000 సంవత్సరంలో వైద్యకళాశాలను ప్రారంభించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కానీ వైసీపీ ప్రభుత్వం ఏ ఒక్కటీ ప్రారంభించలేదని మండిపడ్డారు. అలాగే రాయదుర్గం ప్రభుత్వ ఆస్పత్రిలో 22మంది వైద్యులు ఉండాల్సి ఉండగా కేవలం ఆరుగురే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో వంద పడకల ఆసుపత్రిగా దీనిని మార్చారని తెలిపారు. అందుకు అనుగుణంగా అదనపు భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించారన్నారు. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. పెరుగుతున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా అసంపూర్తిగా ఉన్న భవనాలు పూర్తి చేసి, వైద్యులను నియమించాలని కోరారు.

బాబా జయంతికి

ప్రత్యేక నిధులు ఇవ్వండి

ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి



పుట్టపర్తి రూరల్: ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తి సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ప్రభుత్వాన్ని మంగళవారం కోరారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆమె మాట్లాడుతూ కోట్లాది మంది ఆరాధించే సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలు నవంబరులో ప్రారంభమవుతాయని, అందుకు సంబంధించి ఏర్పాట్లు చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరుచేయాలని విన్నవించారు. సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను రాష్ట్రపండుగగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీఓ జాఈ చేసినందుకు ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జయంతి ఉత్సవాలకు దేశప్రధాని నరేంద్రమోదీతో పాటు దేశవిదేశాల నుంచి ప్రముఖులు రానున్నట్లు వెల్లడించారు. విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ, పట్టణ సుందరీకరణ కోసం ఇప్పటికే ప్రభుత్వానికి రూ.105 కోట్లతో డీపీఆర్ పంపినట్లు పేర్కొన్నారు.

నేడే అమరావతికి.. కొత్త టీచర్ల పయనం

ఉదయం పీవీకేకే కళాశాల నుంచి బయల్దేరనున్న బస్సులు

ఏర్పాట్లు పూర్తిచేసిన విద్యాశాఖాధికారులు



ఏర్పాట్లపై కసరత్తు చేస్తున్న విద్యాశాఖ అధికారులు

అనంతపురం విద్య, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో టీచర్ పోస్టులు సాధించిన వారు బుధవారం అమరావతికి వెళ్లనున్నారు. మెగా డీఎస్సీ సభలో పాల్గొననున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకోనున్నారు. ఈనెల 19వ తేదీనే వెళ్లాలని ఏర్పాట్లు చేయగా.. వర్షాల కారణంగా వాయిదా పడింది. ఈనెల 25న అమరావతిలో మెగా డీఎస్సీ సభ నిర్వహణకు ముహూర్తం ఖరారు చేశారు. టీచర్ ఉద్యోగాలు సాధించిన వారందరినీ తీసుకురావాలని రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు పంపారు. ఆ మేరకు జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు చేపట్టింది. డీఎస్సీలో ఎంపికైన టీచర్లు, పీజీటీ, టీజీటీలతోపాటు ఒక్కో అభ్యర్థి వెంట మరొకరు తప్పనిసరిగా ఉండాలని నిబంధన విధించారు. పర్యవేక్షణకు ప్రతి బస్సులో ముగ్గురిని ఏర్పాటు చేశారు. ఈలెక్కన మొత్తం 2,100 మంది జిల్లా నుంచి అమరావతికి వెళ్తారని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. వీరికోసం 45 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశామన్నారు. బుధవారం ఉదయం 7గంటలకు అనంతపురంలోని ఆలమూరు రోడ్డులోగల పీవీకేకే కళాశాల నుంచి బస్సులు బయల్దేరుతాయన్నారు. అభ్యర్థులు 6 గంటలకే కళాశాలకు చేరుకోవాలని డీఈఓ ప్రసాద్ బాబు కోరారు.

గుడి డబ్బు కోసం గొడవ

● గ్రామసభ వాయిదా



సభలో మాట్లాడుతున్న ఆర్డీఓ కేశవనాయుడు

శింగనమల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గుడి డబ్బు కోసం ఊరి జనం గొడవ పడ్డారు. మండలంలోని పెరవలి గ్రామానికి చెందిన వీరబ్రహ్మం స్వామి దేవాలయం నాయనపల్లి క్రాస్‌లో ఉండేది. ఎన్‌ఎస్ 544 విస్తరణలో గుడి పోయింది. అందుకు నష్టపరిహారం ప్రభుత్వం చెల్లిస్తుంది. పెరవలి గ్రామానికి చెందిన వారు మొదట ఒక ఆలయ కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. విభేదాలు రావడంతో మరో కమిటీ వేసుకున్నారు. గుడికి సంబంధించిన పరిహారం సొమ్ము రూ.60లక్షలుపైగా ఒక కమిటీ పేరున జమ చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. మరో కమిటీ సభ్యులు.. కలెక్టర్, ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేయడంతో గుడి డబ్బు విషయంలో మరోసారి గ్రామంలో సభ నిర్వహించాలని సూచించారు. ఆ మేరకు ఆర్డీఓ కేశవనాయుడు, తహసీల్దార్ శేషారెడ్డి, సీఐ కౌలుట్లయ్య కలిసి పెరవలి సచివాలయంలో మంగళవారం గ్రామసభ ఏర్పాటు చేశారు. రెండు కమిటీల సభ్యులు వాగ్వాదం చేసుకున్నారు. దీంతో అధికారులు గ్రామసభను వాయిదా వేశారు. ఇరు కమిటీలు ఏకాభిప్రాయానికి వస్తేనే ప్రభుత్వం సొమ్ము జమ చేస్తుందనీ, లేదంటే రాదని ఆర్డీఓ కేశవనాయుడు స్పష్టం చేశారు.


కూర్మావతారంలో దర్శనమిస్తున్న శ్రీవారు

కూర్మావతారంలో శ్రీవారు

కదిరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీవారు మంగళవారం కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నిత్య కైంకర్యాలు, అలంకరణ అనంతరం కూర్మావతారంలో ఉన్న స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసురెడ్డి, భక్తులు, ఉభయదారులు పాల్గొన్నారు.

బధిరులను ప్రోత్సహించాలి: కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): బధిరులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బధిరులు, సైన్ లాంగ్వేజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల కార్పొరేషన్ అధ్యక్షుడు గడుపూటి నారాయణస్వామి హాజరయ్యారు. బధిరులు మనోధైర్యంతో ముందుకు సాగుతూ.. అన్ని రంగాల్లో విజయం సాధించాలన్నారు. బధిరుల ఉన్నతికి అన్ని శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. అలిమ్కో ద్వారా జిల్లాలో 948 మందిని శ్రవణ యంత్రాలైన ల్యాప్‌టాప్, టచ్‌ఫోన్లకు ఎంపిక చేశామని, త్వరలోనే వాటిని పంపిణీ చేస్తామన్నారు. గడుపూటి నారాయణస్వామి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం.. బధిరులకు అన్నివిధాలా అండగా ఉంటుందన్నారు. ఏపీ విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ ద్వారా బధిరులకు అవసరమైన సేవలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ అర్చన, సమగ్రశిక్ష పీడీ శైలజ, ఆర్డీటీ ప్రతినిధి రఫీ పాల్గొన్నారు.

ఘనంగా ఆర్పీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఆర్పీఎఫ్ సిబ్బంది

ధర్మవరం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌లో ఆర్పీఎఫ్ సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రైల్వే ప్రయాణికులకు రైల్వే భద్రత గురించి అవగాహన కల్పించారు. సీఐ నాగేశ్వరరావు మాట్లాడుతూ రైల్వేశాఖకు సంబంధించిన ఆస్తులపై ఎవరు దాడులు చేయరాదని, అలా చేస్తే కఠిన శిక్షలు ఉంటాయన్నారు. రైల్వేలో దొంగతనాలు జరగకుండా ప్రత్యేక నిఘాను ఉంచినట్లు తెలిపారు. ప్రయాణికులు అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెట్టుకోవడం వల్ల దొంగతనాలు, మోసాలు జరిగే అవకాశం ఉందన్నారు. అనంతరం గొట్లూరు అనాథాశ్రమంలో బ్రెడ్లు పంపిణీ, చేశారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ ఎస్ఐ కోటేశ్వరరావు, ఏఎస్ఐ పుల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ ఎస్ఈ బదిలీ

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) హరిప్రసాద్‌బాబు బదిలీ అయ్యారు. ఇయనను ఎయిర్‌పోర్టుల అభివృద్ధి సంస్థ లిమిటెడ్ (ఏపీఏడీసీఎల్) చీఫ్ జనరల్ మేనేజర్‌గా డెప్యుటేషన్‌పై బదిలీ చేశారు. అయన స్థానంలో ఇన్‌చార్జి ఎస్ఈగా ఈఈ సుధాకర్‌రెడ్డిని నియమించారు. దీంతో మంగళవారం ఎన్‌హెచ్ ఎస్ఈ హరిప్రసాద్‌బాబు రిలీవ్ అయ్యారు. ఇన్‌చార్జి ఎస్ఈగా సుధాకర్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు.


బాధ్యతలు చేపడుతున్న సుధాకర్ రెడ్డి

అక్రమాలు తేలేనా..?

- జడ్పీలో ఏజీ ఆడిట్ టీమ్.. పదిరోజులపాటు మకాం
- నెలరోజులు అనుబంధ శాఖల్లో ఆడిటింగ్
- పలు శాఖల్లో అధికారులను సంప్రదించిన బృందం

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జడ్పీ కార్యాలయంలో ఏజీ ఆడిట్ టీమ్ మకాం వేసింది. ముగ్గురు అధికారులతో కూడిన బృందం ఆడిట్ ప్రక్రియ మొదలు పెట్టింది. 2019 - 2020 నుంచి 2024-2025 ఆర్థిక సంవత్సరం వరకు పలు పథకాల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపుల వివరాలు పరిశీలిస్తున్నారు. వాటిలో ఏవైనా పొరపాట్లు ఉంటే అందుకు అనుగుణంగా నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందించనున్నారు. జడ్పీలోనే పది రోజులు ఉండి క్షుణంగా పరిశీలించనున్నారు. అనంతరం మరో నెల పాటు అనుబంధ శాఖలకు సంబంధించి ఆడిట్ నిర్వహించనున్నారు. బృందంలోని ఒక్కొక్కరు జడ్పీ సిబ్బందిని వెంటబెట్టుకొని మంగళవారం జిల్లా ఆడిట్ విభాగం సిబ్బందిని కలిసి, సంబంధిత రికార్డులు సిద్ధం చేయాలని ఆదేశించారు. అక్కడి నుంచి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి పనులకు సంబంధించి సెస్ చెల్లింపుల రికార్డులు సిద్ధం చేయాలని సూచించినట్లు తెలిసింది. జిల్లా పంచాయతీ కార్యాలయానికి చేరుకుని అక్కడ అధికారులకు సంబంధించి పలు రికార్డులు సిద్ధం చేయాలని సూచించారు. అక్కడి నుంచి మైనింగ్ తదితర విభాగాలను కూడా సంప్రదించి రికార్డులు సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లా పరిషత్ అంటేనే అక్రమాలకు నిలయం అన్న ప్రచారం ఉంది. రెగ్యులర్ సీఈఓ, డిప్యూటీ సీఈఓలు లేకపోవడంతో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. కింది స్థాయి సిబ్బందికి ఎవరి వాటాలు వారికి ముట్టచెప్పి పెద్దఎత్తున ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డారన్న విమర్శలున్నాయి. అధికారుల అక్రమాలను పాలకులు సీరియస్‌గా తీసుకోకపోవడంతో వారు అడ్డు, అదుపులేకుండా ఎక్కడి సొమ్ము అక్కడ దిగమింగేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. డీఎల్‌డీఓగా ఉన్న ఓ మహిళా అధికారికి ఇన్‌చార్జ్ సీఈఓ బాధ్యతలు కట్టబెట్టడంతో బినామి పేర్లతో పెద్ద ఎత్తున నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారన్న ప్రచారం జరుగుతోంది. వీటిపై పెద్ద ఎత్తున ప్రభుత్వానికి పిర్యాదులు కూడా వెళ్లాయి. ప్రస్తుతం ఏజీ ఆడిట్‌కు రావడంతో ఉద్యోగుల్లో బదిలీ అయినా సరే తీవ్ర ఆందోళన నెలకొంది. ఏజీ ఆడిట్ టీమ్‌ను కూడ మ్యానేజ్ చేసి ఘనులు జడ్పీలో ఉన్నారన్న ప్రచారం జరుగుతోంది.


డీపీఓ కార్యాలయంలో వివరాలు సేకరిస్తున్న ఆడిట్ టీమ్

ఊరెళ్తున్నారా..? ఇల్లు జాగ్రత్త..!

పిల్లలను బాగా చదివించాలని, గొప్పవారిగా తీర్చిదిద్దాలని తల్లిదండ్రులు కలలు కంటారు. అందుకోసం రెక్కలు ముక్కలు చేసుకుంటారు. రూపాయి.. రూపాయి.. కూడబెడతారు. అది ధనం కాదు.. జీవితం, భవిష్యత్తు అన్నీ. అలాంటి అమూల్యమైన సొమ్మును నిర్లక్ష్యం చేస్తున్నారు. పండుగకు ఊరెళ్లాలన్న సంతోషంతో సొమ్ము, నగలను ఇంట్లోనే పెట్టేస్తున్నారు. దొంగల చేతికి ఇల్లు అప్పగిస్తున్నారు. సెలవులు ఆనందంగా గడిపి తిరిగొచ్చాక లూటీ అయిన ఇంటిని చూసి గొల్లుమంటున్నారు. ఒక్క క్షణం ఆలోచించాలి. జీవిత కాల కష్టాన్ని కాపాడుకునేందుకు పోలీసులకు ఒక్క మాట చెబితే చాలు. వారు లాక్డ్ హౌస్ట్ మానిటరింగ్ సిస్టంను ఏర్పాటు చేస్తారు. తెలియనివారు ఎవరు ఆ ఇంట్లోకి చొరబడినా.. ఇట్టే పట్టేస్తారు.

- దసరా సెలవుల్లో చోరీలు జరిగే ప్రమాదం
- ఎల్‌హెచ్ఎంఎస్‌తో ఇంటికి అభయం
- సేవలను వినియోగించుకోవాలని పోలీసుల సూచన

ధర్మవరం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ నేపథ్యంలో పాఠశాలలకు సెలవులు ఇచ్చారు. దీంతో చాలామంది పిల్లలను తీసుకుని ఇల్లు విడిచి స్వగ్రామాలు, ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. ఇదే అదునుగా దొంగలు చోరీలకు పాల్పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఎల్‌హెచ్ఎంఎస్ ద్వారా వీటికి అడ్డుకట్ట వేసి, ఇంటికి రక్షణ కల్పించుకోవచ్చునని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.

LHMS AP Police

వెరీ ఈజీ..

ప్రతి ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్‌లో సులభంగా ఎల్‌హెచ్ఎంఎస్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ యాప్‌ను సెల్‌పోన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఊరు వెళ్లేటపుడు పోలీసు గస్తీ అవసరమని భావిస్తే రిక్వెస్ట్ పోలీస్ వాచ్ ఆప్షన్‌ను క్లిక్ చేసి సెల్‌పోన్ ఐడీని పూరించాలి. ఏ రోజు ఊరు వెళ్తున్నారో ఆ తేదీతోపాటు తిరిగి వచ్చే తేదీని తెలియజేస్తే కంట్రోల్ రూంకు సమాచారం చేరిపోతుంది. అలారంలో ఈ కెమెరా లింక్ అయ్యి ఉండటంతో ఎలాంటి కదలిక ఉన్నా కంట్రోల్ రూం, స్థానిక పోలీసు స్టేషన్‌కు వెంటనే సమాచారం వస్తుంది. దీంతో పోలీసులు తక్షణం అప్రమత్తమవుతారు. దూర ప్రాంతాలకు వెళ్లేటపుడు పరిసరాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తుంటే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఇంటి ద్వారాలకు అలారం ఏర్పాటు చేసుకుంటే దొంగలు తలుపులు తెరిస్తే అవి ఎక్కువ శబ్దం చేస్తాయి.

ఎల్‌హెచ్ఎంఎస్‌ను వినియోగించుకోండి



దసరా సెలవులకు ఊరెళ్లేవారు తప్పకుండా ఎల్ హెచ్ ఎం ఎస్‌ను వినియోగించుకోవాలి. యాప్‌లో సమాచారం ఇస్తే చాలు.. ఆ ఇంటిపై నిఘా పెడతాం. చోరీలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటాం. ప్రతిఒక్కరూ బాధ్యతగా ఎల్‌హెచ్ఎంఎస్ సేవలను వినియోగించుకోవాలి.

-హేమంత్ కుమార్, డీఎస్పీ, ధర్మవరం

ఆప్కో వస్త్రాలపై 40శాతం డిస్కౌంట్

- వాణిజ్య అధికారి వరప్రసాద్


తగ్గింపు ధరలకు పట్టుచీరలను విక్రయిస్తున్న సిబ్బంది

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆప్కో వస్త్రాలపై 40శాతం డిస్కౌంట్(తగ్గింపు) ఇస్తున్నట్లు ఆప్కో మండల వాణిజ్య అధికారి వరప్రసాద్ మంగళవారం తెలిపారు. వినియోగదారుల అభిరుచి మేరకు ఉప్పాడ, జాంధాని, వెంకటగిరి, మంగళగిరి, కోడుమూరు, మదనపల్లి, బందరు, రాజమండ్రి, మాధవరం తదితర పట్టు, కాటన్ చీరలు ఆప్కో విక్రయశాలల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. డ్రెస్ మెటీరియల్స్, బెడ్‌షీట్స్, లుంగీలు, షర్టింగ్, సిల్క్ అండ్ కాటన్ ధోవతులు విక్రయిస్తున్నట్లు తెలిపారు. విక్రయశాలలను సందర్శించి నచ్చిన వస్త్రాలను కొనుగోలుచేసి 40శాతం తగ్గింపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డిస్కౌంట్ ఇస్తున్న ఆప్కో విక్రయశాలల వివరాలు...

ఆప్కో విక్రయశాల	నంబర్
పోలీస్ వెల్ఫేర్, అనంతపురం	08554- 249475
క్లాక్‌టవర్ నేతబజార్, అనంతపురం	08554- 245465, 9849993040
సప్తగిరి సర్కిల్, అనంతపురం	08554- 233777, 9515220570
కదిరి	08494- 220159, 9381436370
పుట్టపర్తి	08555- 288562, 9059963334
జయనగర్, బెంగళూరు	9949250327
ఎన్ఆర్ కాలనీ, బెంగళూరు	9989744913
మైసూరు	8106220556

చీనీ టన్ను రూ.21 వేలు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.21వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఇన్‌చార్జ్ కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.14వేలు పలికాయని తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 294 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు తెలిపారు.

సబ్సిడీతో జిప్సం, క్రిమిసంహారక మందులు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జాతీయ ఆహార భద్రతా పథకంలో భాగంగా రైతులకు సబ్సిడీతో జిప్సం, 17 రకాల క్రిమిసంహారక మందులు పంపిణీ చేయనున్నట్లు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ మంగళవారం తెలిపారు. 50 కేజీల జిప్సం పూర్తి ధర రూ.262 కాగా.. సబ్సిడీపోను రూ.187కి అందజేస్తామన్నారు. 17 రకాల క్రిమిసంహారక మందులను 50 శాతం వరకు సబ్సిడీతో ఇస్తామన్నారు. అవసరమున్న రైతులు మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రైతు ఆత్మహత్య


సురేష్ (ఫైల్)

పెద్దవడుగూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన రైతు సురేష్(35) అప్పుల బాధతో మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు, సురేష్ తన తండ్రికి చెందిన రెండు ఎకరాలకు తోడు మరో ఐదు ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తి పంటను సాగు చేశారు. పెట్టుబడి కోసం రెండేళ్లలో రూ.6.50 లక్షలు అప్పు చేశారు. పంట దిగుబడి సరిగా రాక వాటిని తీర్చలేకపోయారు. రుణదాతల నుంచి ఒత్తిళ్లు అధికం కావడంతో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉండగా కుటుంబ సభ్యులు గమనించి, పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఆయనకు భార్య రజిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి గ్యార్మీ మాసం

అనంతపురం టౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ముస్లింల ప్రధాన పండుగల్లో ఒకటైన గ్యార్మీ వేడుకలు బుధవారం ప్రాప్రారంభంకానున్నాయి. వేడుకలకు జిల్లావ్యాప్తంగా దర్గాలు ముస్తాబయ్యాయి. జిల్లాకేంద్రంలోని శ్రీనివాసనగర్‌లో గల షాహే గౌసే ఆజం ఆసార్ దర్గాలో బుధవారం నుంచి అక్టోబరు 4వతేదీ వరకు వేడుకలు నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ అధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్, కోశాధికారి అబ్దుల్ సమీ మంగళవారం ప్రకటనలో వెల్లడించారు. అక్టోబరు 3వ తేదీన రాత్రి గంధం ఊరేగింపు, 4న సాయంత్రం 5 గంటలకు దస్తగిరి స్వామి పవిత్ర కేశదర్శనం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

పీఎంశ్రీ స్కూళ్ల లే అవుట్ రూపొందించండి

- ఇంజనీర్లకు ఏపీసీ శైలజ ఆదేశం

అనంతపురం విద్య, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ స్కూళ్ల లేఅవుట్ తయారుచేసి పంపాలని ఇంజనీర్లకు సమగ్రశిక్ష ఏపీసీ శైలజ ఆదేశించారు. స్థానిక సమగ్రశిక్ష కార్యాలయంలో మంగళవారం సివిల్ పనులు, పీఎంశ్రీ స్కూళ్లపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఏపీసీ శైలజ మాట్లాడుతూ.. జిల్లాలో 44పీఎంశ్రీ స్కూళ్లు ఉన్నాయన్నారు. వాటి వివరాలతో ప్రత్యేక లేఅవుట్ తయారుచేసి, పంపాలన్నారు. పాఠశాలల్లో సివిల్ పనులను నాణ్యతగా చేపట్టాలని సూచించారు.

పీజీ ప్రవేశాలు ప్రారంభం

అనంతపురం రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పీజీ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. వీసీ ప్రొఫెసర్ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, రెక్టార్ వెంకటనాయుడు ప్రక్రియను మంగళవారం ప్రారంభించారు. కిర్మయి అనే విద్యార్థిని తొట్టతొలిగా బయో కెమిస్ట్రీ అడ్మిషన్ పొందారు. వీసీ అనిత.. అడ్మిషన్ పత్రాన్ని విద్యార్థినికి అందజేశారు. వీసీ మాట్లాడుతూ.. మూడురోజులపాటు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. విశ్వవిద్యాలయంలోని పలు విభాగాలకు మొదటి విడతలో 328 సీట్లు అలాట్ అయ్యాయన్నారు. మొదటి రోజు మంగళవారం కావడంతో 17 మంది మాత్రమే అడ్మిషన్ తీసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్, సైన్స్ కళాశాలల ప్రిన్సిపాల్ అంజనేయులు, వైస్‌ప్రిన్సిపాల్ మునినారాయణప్ప, ప్రొఫెసర్లు చిట్టాసురేష్, నరసింహన్, రమణ, శ్రీనివాసన్, శోభాలత, అసిస్టెంట్ ప్రొఫెసర్ మాధవి పాల్గొన్నారు.

నిడిమామిడిలో రాజగురువు శాసనం

- గుర్తించిన చరిత్రకారుడు మైనాస్వామి


నిడిమామిడిలో 1438నాటి రాజగురువు శాసనాన్ని చూపుతున్న చరిత్రకారుడు మైనాస్వామి

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడిమామిడి వీరభద్రాలయం పక్కన ఉన్న శ్రీశైలజగద్గురు సంస్థానంలో 1438 నాటి శాసనం గుర్తించినట్లు చరిత్రకారుడు మైనాస్వామి మంగళవారం పేర్కొన్నారు. కాళయుక్తి సంవత్సరం శ్రావణమాసంలో శ్రీశైలజగద్గురు బసవరాజ మహాదేవ సజీవ సమాధిపై నాటి రాజగురువు చంద్రభూషణదేవ మహామండలాచార్య బసవన్న విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు ఈ శాసనంలో రాశారన్నారు. ఇంగ్లీషు సంవత్సరం తేదీ ప్రకారం సంస్థానంలో నంది విగ్రహ ప్రతిష్ఠ 1438 ఆగస్టులో జరిగిందని మైనాస్వామి వివరించారు. చిన్నరాతిపలకపై తెలుగులో శాసనాన్ని రాయగా పై భాగంలో నంది శిల్పాన్ని సుందరంగా మలిచారన్నారు. విజయనగర సామ్రాజ్య చక్రవర్తి రెండో దేవరాయల (1424-1446) కాలంలో నిడిమామిడి సంస్థాన అధిపతి చంద్రభూషణదేవ మహాచార్య రాజగురువుగా పనిచేశారన్నారు. ఈయన నిడిమామిడి నుంచి పెనుకొండకు, అక్కడి నుంచి హంపికి వెళ్లి రాజగురువుగా వ్యవహరించినట్లు మైనాస్వామి పేర్కొన్నారు.

పనులు నాణ్యంగా ఉండాలి

- పంచాయతీరాజ్ ఎస్ఈ చిన్న సుబ్బరాయుడు


కత్రిమల వద్ద బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న పీఆర్ ఎస్ఈ

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో ఎక్కడా నాణ్యతాలోపాలకు తావులేకుండా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఎస్ఈ చిన్నసుబ్బరాయుడు.. సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలో పీఆర్, పీఐయూ ఆధ్వర్యంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అనంతపురం నుంచి తాడిపత్రికి పోయే మార్గంలో సలకం చెరువు వద్ద రూ.6.32 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం పెద్దవడుగూరు మండలంలో చిత్తూరు నుంచి పామిడి వరకు చేపట్టిన రోడ్డు నిర్మాణంలో భాగంగా బ్రిడ్జిని పరిశీలించారు. అక్కడ నుంచి పామిడి మండలంలోని పెన్నా నది వద్ద కొత్తపల్లి నుంచి కత్రిమలకు వెళ్లే మార్గంలో రూ.10 కోట్లతో నిర్మిస్తున్న బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ చిన్న సుబ్బరాయుడు మాట్లాడుతూ పనులను గడువులోపు వేగవంతంగా పూర్తి చేయాలని స్థానిక సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట పీఐయూ ఈఈ మల్లికార్జున, డీఈలు మురళి, నారాయణస్వామి, పాండురంగారెడ్డి తో పాటు స్థానిక సిబ్బంది కాంట్రాక్టర్లు ఉన్నారు.

ఉద్యాన ఉత్పత్తుల ధరలపై ఆరా


టమోటా మండీలో ధరలపై ఆరాతీస్తున్న అధికారులు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలైన చీనీ, టమోటా ధరలపై ఉద్యాన, అగ్రివాచ్ సంస్థ ప్రతినిధులు ఆరాతీశారు. అనంతపురం మార్కెట్‌యార్డులో చీనీ ఉత్పత్తులను ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఉమాదేవి, ఏడీ దేవానంద్, ఏపీఎంఐపీ ఏడీ ధనుంజయ, హెచ్‌ఓలు రత్నకుమార్, అగ్రివాచ్ సంస్థ ప్రతినిధి ముస్లిహిమయుద్దీన్ పరిశీలించారు. చీనీ ధరలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం చీనీ టన్ను నాణ్యతను బట్టి రూ.10వేల నుంచి రూ.20వేలదాకా పలుకుతోందని వ్యాపారులు తెలిపారు. ఆ తర్వాత అనంతపురం నగర శివారులోని కక్కలపల్లి టమోటా మండీలో ధరలపై ఆరాతీశారు. ప్రస్తుతం 15 కేజీల టమోటా బాక్సు రూ.250 నుంచి రూ.350దాకా పలుకుతోందని వ్యాపారులు తెలిపారు. ఉద్యాన ఉత్పత్తుల ధరలు ఒక్కోసారి తగ్గడం, పెరగడంపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అగ్రి వాచ్ సంస్థకు బాధ్యతలు అప్పగించిందని ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఉమాదేవి పేర్కొన్నారు. అందులో భాగంగానే జిల్లాలో చీనీ, టమోటా ఉత్పత్తుల ధరలపై సంస్థ ప్రతినిధులతో కలిసి ఆరాతీశామన్నారు. క్షేత్రస్థాయిలో మరింత లోతుగా సంస్థ ప్రతినిధులు ధరలపై అధ్యయం చేసి, నివేదికలు సమర్పిస్తారన్నారు.

టమోటా కిలో రూ.22

అనంతపురం రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో మంగళవారం టమోటా కిలో రూ.22తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠ ధర రూ.14 సరాసరి ధర రూ.17 విక్రయాలు జరిగాయని పేర్కొన్నారు. మార్కెట్‌కు మూడు వేల టన్నుల టమోటాలు వచ్చినట్లు తెలిపారు.

న్యూస్ బాక్స్

మాంచో ఫెర్రర్‌ను కలిసిన జేసీపీఆర్


మాంచోతో జేసీ ప్రభాకర్‌రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్‌ను మంగళవారం సంస్థ ప్రధాన కార్యాలయంలో తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్, నిధుల నిలుపుదల నిర్ణయంపై వెనక్కి తీసుకునే విధంగా కృషి చేస్తాయని మాంచోకు సంఘీభావం తెలిపారు. మంత్రి నారా లోకేష్ చొరవతో ఆర్డీటీ సమస్య పరిష్కారమవుతుందని జేసీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

ఉద్యోగోన్నతులు కల్పించాలి


నిరసన తెలుపుతున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సీనియార్టీ జాబితా ప్రకటించి అర్హత ఆధారంగా ఉద్యోగోన్నతులు కల్పించాలని గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు మంగళవారం భోజనవిరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు సుధాకర్, లక్ష్మీనారాయణ, మల్లికార్జున, చంద్ర మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే సీనియార్టీ జాబితా విడుదల చేసి ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, కిశోర్, ఆదినారాయణ, నాగేంద్ర, శిరీష, మాధవి, సునీత, గిరి, ప్రసాద్, సాయిప్రతాప్, విజయ్, మల్లికార్జున రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు


స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న ఎల్.నారాయణచౌదరి

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్.నారాయణచౌదరి పేర్కొన్నారు. చెన్నేకొత్తపల్లిలో మంగళవారం లబ్ధిదారులకు ఆయన స్మార్ట్‌రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వం స్మార్ట్‌కార్డులను అందిస్తోందన్నారు. ప్రతినెల రేషన్ సక్రమంగా పంపిణీచేయాలని ఆయన డీలర్లకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేశ్‌కుమార్, సీఎస్‌డీటీ గురుప్రసాద్, టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబుళేశు, సింగిల్‌విండో చైర్మన్ నరసింహులు, నాయకులు అంకె అమరేంద్ర, రామకృష్ణారెడ్డి, అమరేంద్రరెడ్డి, కిష్టప్ప, మురళి, శివ, సూరి, నరసింహులు, డీలర్లు రామాంజనేయులు, మల్లికార్జున, కానశివారెడ్డి, ఓబిరెడ్డి, ఫణీంద్ర పాల్గొన్నారు.

'గిరి బలిజ' పదాన్ని తొలగించండి

అనంతపురం రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): గిరి బలిజ లో బలిజ అనే పదాన్ని తొలగించాలని రాయలసీమ బలిజ మహా సంఘం జిల్లా అధ్యక్షుడు తొండపునాటి శంకరయ్య డిమాండ్ చే శారు. ఈ మేరకు మంగళవారం శ్రీనివాసనగర్‌లోని బలిజ సం ఘం కార్యాలయంలో సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం దొ మ్మర కులస్థులను గిరి బలిజగా మార్పు చేస్తూ జీ.ఓ నెంబరు 1793 విడుదల చేసిందన్నారు. దొమ్మర కులస్థులను కులంపేరు తో దూషిస్తున్నారని కులం పేరు మార్పు చేయడాన్ని సమర్థిస్తున్నామని, గిరి బలిజగా మార్పు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు.

గూగూడులో హుండీ లెక్కింపు

నార్పల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూగూడు కుళ్లాయిస్వామి దేవస్థానంలోని ఆంజనేయస్వామి హుండీ మంగళవారం లెక్కించారు. భక్తులు హుండీలో వేసిన కానుకలను లెక్కించగా రూ. 9,46,875 వచ్చింది. కుళ్లాయిస్వామి ఆలయంలో 79.350 వెండి కిలోలు వచ్చిందన్నారు. సుల్తాన్‌పేట గొంచి మాన్యం 0.07 సెంట్ల భూమి బహిరంగ వేలం వేయగా ఒక సంవత్సరానికి రూ.12 వేలు నార్పలకు చెందిన నాగరాజు పాడి దక్కించుకున్నట్లు ఈఓ శోభ తెలిపారు.

శాస్త్రోక్తంగా నవగ్రహ పూజలు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీ కాలనీలోని వలీ స్వామి ఆశ్రమంలో నవగ్రహాలు ప్రతిష్ఠించి 41 రోజులు ముగిసిన నేపథ్యంలో మంగళవారం మండల పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ ప్ర ధాన కార్యదర్శి దేవనూరు విజయ్‌కుమార్, జయచంద్రరెడ్డి, చంద్రశేఖర్ బాబు, కొండారెడ్డి, నాగప్రసాద్, రామకృష్ణ, రామమూర్తి పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి : ఆప్టా

అనంతపురంవిద్య, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై నిర్లక్ష్యం తగదని, పాత బకాయిలు వెంటనే చెల్లించాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్(ఆప్టా) జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఏడాదిన్నర కావస్తున్నా ఇప్పటికీ సీపీఎస్ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, పీఆర్‌సీ, డీఏ అరియర్స్ ఈఎల్స్ బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై ఉద్యమబాట : ఎస్టీయూ

అనంతపురం విద్య, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలపై ఉద్యమాలకు శ్రీకారం చుడతామని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి పేర్కొన్నారు. జిల్లా కార్యాలయంలో మంగళవారం ఎస్టీయూ నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ.. జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉద్యమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఫణిభూషణ్, శివయ్యాచారి, కృష్ణమోహన్, రాజశేఖర్, నారాయణస్వామి,చంద్రశేఖర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి

మహాదేవీ నమోస్తుతే..!

ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు





కొత్తూరు అమ్మవారిశాల, అర్బన్ బ్యాంకు వద్ద, శారదానగర్‌లోని శంకరమఠం, శివబాలయోగి ఆశ్రమంలో అమ్మవారికి అలంకరణలు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దసరా దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని రెండోరోజు మంగళవారం అమ్మవారు మాహేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లా కేంద్రంలోని శారదానగర్‌లోని శృంగేరి శారదా శంకరమఠంలో అమ్మవారిని వృషభ వాహనంపై మహేశ్వరిదేవిగా అలంకరించారు. మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో మీనాక్షిదేవిగా, ఐదోరోడ్డులోని నల్లమల సుంకలమ్మ దేవాలయంలో అన్నపూర్ణేశ్వరిగా అలంకరించారు. గుల్జార్ పేటలోని కొత్తూరు వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో రంగుల గాజులతో, పాతూరులోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఫ్యాన్సీ బార్డర్లతో అలంకరించి పూజలు నిర్వహించారు. శివకోటి ఆలయంలో మాహేశ్వరిదేవిగా, హరిహర దేవాలయంలో మంగళగౌరిగా, చౌడేశ్వరి దేవాలయంలో పూజావస్తుల అలంకారం, హెచ్చెల్సీ కాలనీలోని చాముండేశ్వరి దేవాలయాల్లో అమ్మవారిని ధనలక్ష్మీదేవిగా అలంకరించారు. రామచంద్రనగర్‌లోని షిర్డిసాయి ఆలయంలో గాయత్రిదేవిగా, పాతూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, ఐదో రోడ్డు కనకదుర్గ భవాని దేవాలయం, మొదటిరోడ్డులోని చౌడేశ్వరి దేవాలయాల్లోనూ అమ్మవారిని రకరకాల రూపాల్లో అలంకరించి పూజలు నిర్వహించారు.


శివకోటిలో మాహేశ్వరిగా అలంకరణ


హౌసింగ్‌బోర్డులో వేదమాత గాయత్రిని దర్శించుకుంటున్న ఎంపీ అంబికా

ఎంపీ ప్రత్యేక పూజలు

దసరా నవరాత్రుల సందర్భంగా మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంబేడ్కర్ నగర్‌లో దుర్గామాతను ఎంపీ దర్శించుకున్నారు. అనంతరం హౌసింగ్‌బోర్డు వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద వేద మాత గాయత్రిదేవిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు చేయూత


టీడీపీ కార్యకర్త కుటుంబసభ్యులకు సాయం చేస్తున్న నాయకులు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కక్కలపల్లి కాలనీలో ఇటీవల మృతి చెందిన టీడీపీ కార్యకర్తతో పాటు పార్టీ సాభూతిపరుడి కుటుంబాలకు మాజీ మండల కన్వీనర్ చల్లా జయకృష్ణ చేయూత నిచ్చారు. మంగళవారం మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ తదితరులతో కలసి వారి ఇళ్లకు వెళ్లిన తన వంతుగా కుటుంబానికి రూ.30వేలు చొప్పున రెండు కుటుంబాలకు రూ.60వేలు ఆర్థిక సాయం సాయం చేశారు. ఈ సందర్భంగా జయకృష్ణమాట్లాడుతూ.. నవీన్ కుమార్, ఐజీనగర్‌కు చెందిన పాండు రంగ పార్టీకోసం పనిచేశారరన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ సర్పంచు సుశీలమ్మ భర్త ప్రకాష్, ప్రమాదంలో గాయపడిన మాజీ స్టోర్ డీలర్ బా బు ప్రసాద్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, పేరం హరి, రంగనాయకులు, వెంకటేష్ గౌడ్, సూరి, రామనంద, ప్రసాద్, సాయి, వెంకీ, అక్కులన్న, గౌరీ, కుళ్లాయప్ప, సురేష్, రవి పాల్గొన్నారు.

మధుసూదన్ నాయక్‌కు దివ్యం జోనల్ అవార్డు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల క్రికెట్ సంఘం సౌత్ ఇండియా కోఆర్డినేటర్ మధుసూదన్ నాయక్‌కు జాతీయ దివ్యం అవార్డు దక్కింది. ప్రతి ఏటా దివ్యాంగ క్రికెట్ సంఘం, రాజస్థాన్ దివ్యాంగ క్రికెట్ అసోసియేషన్ సంయుక్తంగా అందజేసే దివ్యం అవార్డుకు జిల్లా వాసి, దివ్యాంగ క్రికెట్ సంఘం సౌత్ ఇండియా కోఆర్డినేటర్ మధుసూదన్ నాయక్‌ను ఎంపిక చేశారు. జైపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆ రాష్ట్ర క్రీడాశాఖ చైర్మన్ పవన్, జాతీయ దివ్యాంగ క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి రవిచౌహాన్ చేతుల మీదుగా మధుసూదన్‌నాయక్ ఈ అవార్డు అందుకున్నారు. దివ్యాంగుల క్రికెట్ అభివృద్ధికి చేస్తున్న కృషికి ఈ అవార్డుకు ఎంపికయ్యారు.

గోపాలమిత్రలకు గౌరవ వేతనం ఇవ్వాలి

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గోపాల మిత్రలకు పెండింగ్‌లోని ఐదు నెలల గౌరవ వేతనం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయ మేనేజర్ మంజులకు గోపాల మిత్ర అసోషియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం గోపాల మిత్ర అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ఉపాధ్యక్షుడు నాగభూషణస్వామి, కార్యదర్శి రంగప్పలు ఆమెకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శివయ్య, కుళ్లాయప్ప, బాలకొండయ్య, శివప్రసాద్, సుధాకర్ పాల్గొన్నారు.

ఎంహెచ్‌ఓ రంగస్వామి బదిలీ

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అనంత నగర పాలక సంస్థ కార్యదర్శి, ఇన్‌చార్జి మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ (ఎంహెచ్‌ఓ) రంగస్వామి బదిలీ అయ్యారు. మైదుకూరు మున్సిపల్ కమిషనర్‌గా నియమిస్తూ రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రంగస్వామి స్థానంలో ఎవరినీ నియమించలేదు. రెండు మూడు రోజుల్లో ఆయన రిలీవ్ కానున్నారు.

అవార్డు గ్రహీతకు అభినందనలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉత్తమ రక్తదాత అవార్డు గ్రహీతకు చిరంజీవి బ్లడ్‌బ్యాంకు నుంచి అభినందనలు తెలిపారు. 18ఏళ్లలో 54సార్లు రక్తదానం చేసిన జిల్లాకు చెందిన రక్తదాత సుంకర రమేష్‌కు జాతీయ అవార్డు దక్కింది. ఇటీవల ఢిల్లీలో జాతీయ ఉత్తమ రక్తదాత అవార్డు అందుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని చిరంజీవి ఐ బ్లడ్ బ్యాంకు కార్యాలయంలో జనరల్ జనరల్ మేనేజర్ రవణం స్వామినాయుడు మెమెంటో అందజేసి అభినందించారు.

సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆత్మకూరు సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి బాబు, ప్రధాన అర్చకుడు రాముస్వామి పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులపై వేధింపులు ఆపాలి

అనంతపురం రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రుద్రంపేట గ్రామ పంచాయతీలో కార్మికులపై అధికార పార్టీ నాయకుల వేధింపులు ఆపాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు గోపాల్, ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పంచాయతీ కార్మికులతో కలసి రుద్రంపేట సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేశారు. పంచాయతీలో కార్మికులపై అధికార పార్టీ నాయకుల వేధింపులు ఎక్కువయ్యాయని అన్నారు. నాయకుల మాట వినకపోతే కార్మికులను ఇష్టారాజ్యంగా విధుల్లో నుంచి తొలగిస్తున్నారని అన్నారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు అజాంబాషా, ఆదినారాయణ, బాషా, చంద్ర, వేణు, మూర్తి, లింగమయ్య పాల్గొన్నారు.

ఆదిశేషుడిపై వేంకటేశ్వరుడు


ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి

అనంతపురం టౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వరస్వామి ఆదిశేష వాహనదారుడై భక్తులకు కనువిందు చే శారు. దసరాను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీవెంకటేశ్వరస్వా మి దేవాలయంలో నిర్వహిస్తు న్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజున మంగళవారం వా హన సేవలు ఆరంభమయ్యా యి. ఈ సందర్భంగా శ్రీవారు ఆదిశేష వాహనంపై భక్తులకు సాక్షాత్కరించారు. సాయంత్రం ఆదిశేష వాహనంపై శ్రీవారిని ఊరేగించారు.

కలెక్టర్‌ను కలిసిన డీసీఎంఎస్ చైర్మన్


కలెక్టర్‌ను సన్మానిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేశులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో డీసీఎంఎస్ ద్వారా రైతులకు నాణ్యమైన ఎరువులు, యూరియా సరఫరా చేయడానికి తగిన చ ర్యలు తీసుకుంటామని డీసీఎంఎస్ చైర్మన్ వెంకటేశులు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్ ను మర్యాదపూర్వకంగా కలిసిన డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేశులు శాలువా, పుష్ప గుచ్ఛం అందజేసి సన్మానించారు. ఉమ్మడి జిల్లాలో రైతులకు యూరియా సమస్యను కలెక్టర్ దృష్టికి తీ సుకెళ్లారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ కచ్చితంగా రైతులకు సరిపడ యూరియా సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు.

పేటీఎంపై కేసు గెలిచిన లా విద్యార్థి

అనంతపురం రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో లా మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి తన్వీర్ బాషా పేటీఎంపై వినియోగదారుల కోర్టులో కేసు గెలిచాడు. ఇందుకు మంగళవారం కళాశాలలో విద్యార్థిని లా విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రీరాములు అభినందించారు. లా విద్యార్థులు సన్మానించారు. ఈ సందర్భంగా విభాగాధిపతి మాట్లాడుతూ..ప్రతి న్యాయ విద్యార్థి ఇలా కేసుల్లో విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

వై.కొత్తపల్లిలో ఉచిత పశువైద్య శిబిరం

ఆత్మకూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వై.కొత్తపల్లిలో మంగళవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో పశువుల కు ఉచిత గర్భకోశ వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వందలాది పశువులును రైతులు తీసుకువచ్చి పరీక్షలు చేయించారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ వెంకటేసులు, డీడీ రమేష్‌రెడ్డి, ఏడీ పద్మనాభంవైద్యాధికారి ప్రకాష్, పశువైద్య అధికారులు పాల్గొన్నారు.

కార్మికులకు నష్టం కలిగించడం దుర్మార్గం

అనంతపురం రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కార్మికులకు నష్టం కలిగించే విధానాలకు అనుకూలంగా అసెంబ్లీలో ఆమోదించడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సోములదొడ్డి ఐఎంఎల్ డిపో ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల పని గంటలను 8 గంటల నుంచి 10 గంటలుగా మారుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని తీవ్రం ఖండిస్తున్నామని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌రెడ్డి, రాజు, పుష్పరాజు, నాగార్జున, మారుతి పాల్గొన్నారు.

ప్రొటోకాల్‌పై కమిషనర్ నిర్లక్ష్యం : మేయర్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలో అభివృద్ధి పనులు చేపట్టే సమయంలో ఏఎంసీ కమిషనర్ ప్రొటోకాల్ పాటించలేదని నగర మేయర్ మహ్మద్ వసీం మండిపడ్డారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హౌసింగ్‌బోర్డులో రూ.2 కోట్ల ఏఎంసీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి భూమిపూజకు మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లకు కనీస సమాచారం లేదన్నా రు. నగరపాలక సంస్థ కౌన్సిల్ వైసీపీది అని ఎమ్మెల్యే, కమిషనర్‌కు తెలియదా అని ప్రశ్నించారు. కేంద్రం నుంచి వచ్చిన నిధులపై అధికారపార్టీకి చెందిన ఎంపీకి కూడా కనీస సమాచారం ఇవ్వకపోవడం దా రుణమన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు నరసింహులు, శ్రీనివాసులు, అనిల్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

లారీ బోల్తా .. ఇద్దరికి స్వల్ప గాయాలు

నార్పల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బొందలవాడ గ్రామ శివారులో మంగళవారం సిమెంట్ లారీ బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. తాడిపత్రి నుంచి ధర్మవరంవైపు లారీ సిమెంటు లోడుతో వెళుతోంది. బొందలవాడ శివారుకు రాగానే ముందువెళ్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించుబోయిన లారీ డ్రైవర్ ఒక్కసారిగా వాహనాన్ని పక్కకు తిప్పడంతో లారీ బోల్తా పడింది. లారీ డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

గృహనిర్మాణాలపై ప్రత్యేక దృష్టి

- యూనిట్ ధర రూ.2.5 లక్షలకు పెంపు
- నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అర్బన్ గృహనిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అనంత నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక నగరపాలక సంస్థ కౌన్సిల్‌హాల్‌లో అర్బన్ హౌసింగ్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. అనంతపురం అర్బన్‌కు సంబంధించి కేటాయించిన లేఔట్లలో 18,690 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇందులో ఆప్షన్ 1, 2 కింద 11,318 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 2,338 ఇళ్లు పూర్తి చేశారని, నిర్మాణదశలో 2,558 ఇళ్లు ఉన్నాయన్నారు. ఆప్షన్ 3 కింద 7,332 ఇళ్లు మంజూరు కాగా 2,507 ఇళ్లు పూర్తి చేశారని, 4,814 ఇళ్లు నిర్మాణదశలో ఉన్నాయని తెలిపారు. నిర్మాణదశలో ఉన్న ఇళ్లలో వార్డు అమెనిటీస్ సెక్రటరీలు ప్రతి వారం నాలుగు ఇళ్లు పూర్తి చేయాలన్నారు. గతంలో ఒక్కో ఇంటికి ధర రూ.1.8 లక్షలు ఉండేదని, ప్రస్తుతం యూనిట్ ధర రూ.2.5 లక్షలకు పెంచినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన ప్రతి ఇళ్లు పూర్తి చేయాలని, వెంటనే నిర్మాణాలు ప్రారంభించేలా చూడాలని సూచించారు. సమావేశంలో ఏఎంసీ ఎస్ఈ రాజశేఖర్, హౌసింగ్ ఇంజనీర్లు శివారెడ్డి, జమీల్ పాల్గొన్నారు.


సమీక్షిస్తున్న కమిషనర్ బాలస్వామి, ఎస్ఈ

రుణాల రెన్యువల్‌కు ఒత్తిడి..!

ఫీల్డ్ ఆఫీసర్ తీరుపై రైతుల ఆగ్రహం

రామగిరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పంట రుణాల రెన్యువల్ కోసం పేరూరు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ తమను ఇబ్బంది పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. ఐదేళ్ల నుంచి పంటలు సరిగా పండక తీవ్రంగా నష్టపోయామని అన్నదాతలు అంటున్నారు. చేతిలో చిల్లిగవ్వలేక ఇబ్బంది పడుతున్నామని, ఇలాంటి సమయంలో రెన్యువల్‌కు డబ్బులు ఎక్కడి నుంచి తేవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పరిస్థితిని వివరించినా ఫీల్డ్ ఆఫీసర్ సాయిచంద్ పదే పదే ఫోన్ చేస్తూ వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెన్యువల్ చేసుకునేందుకు నేరుగా రాలేకపోతే రూ.5 వేలు, రూ.7 వేలు ఫోన్ పే చేయాలని ఒత్తిడి చేస్తున్నారని అంటున్నారు. అలా చేస్తే సిబిల్ స్కోర్ తగ్గకుండా చూస్తానని చెబుతున్నారని, లేదంటే ఏ బ్యాంకులోనూ రుణాలు మంజూరు కాకుండా చేస్తానని బెదిరిస్తున్నారని వాపోయారు.

వేధించలేదు..

బ్యాంకు నిబంధనల ప్రకారం పంట రుణాలను రెన్యువల్ చేసుకోవాలని రైతులను కోరానని ఫీల్డ్ ఆఫీసర్ సాయిచంద్ అన్నారు. బకాయిపడ్డవారికి ఫోన్ చేశానని అన్నారు. ఎవరినీ బెదిరించలేదని, ఫోన్ పే చేయమని అడగలేదని అన్నారు.

ఆలయాల జీర్ణోద్ధరణకు సహకరించండి

దేవదాయశాఖ మంత్రికి ఎమ్మెల్యే దగ్గుపాటి వినతి


మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం టౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శిథిలావస్థకు చేరుకున్న ఆలయాల పునర్నిర్మాణానికి సహకారమందించాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఆయన దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చాంబర్‌కు వెళ్లి వినతి పత్రం అందజేశారు. నగరంలోని మొదటిరోడ్డు కాశీ విశ్వేశ్వర కోదండ రామాలయం పునర్నిర్మాణం కోసం రూ.4.50 కోట్లు నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆలయానికి సంబంధించిన ఫొటోలు, ఆలయ చరిత్ర వివరాలను మంత్రికి అందజేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు. మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంతోపాటు మిగిలిన ఆలయాలకూ దేవదాయశాఖ నుంచి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.

ఉరితాళ్లుగా ప్రైవేట్ కళాశాలలు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ కళాశాలలు విద్యార్థులకు ఉరితాళ్లుగా మారాయని పలు విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్ఆర్ఐటీ కళాశాలలో విద్యార్థి మృతిపై నిగ్గు తేల్చాలని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు వేమన, వీరేంద్ర, సిద్దు, ప్రతాప్, శివ, తేజ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

నార్పల,సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నడిమిదొడ్డి గ్రామ శివారులో మంగళవారం జరిగిన ద్విచక్రవాహన ప్రమాదంలో జయరాం అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి చెందిన జయరాం ద్విచక్రవాహనంలో తమ బంధువుల పిల్లలు ముగ్గురిని తీసుకెళ్తున్నాడు. గ్రామ శివారులో రాగానే ద్విచక్రవాహనం అదుపు తప్పి గొయ్యిలో పడటంతో జయరాంకు తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురు చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి.

యూరియా తగిన మోతాదులోనే వాడాలి

రాప్తాడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పంటలకు తగిన మోతాదులోనే యూరియా వాడాలని ఏఓ కృష్ణ చైతన్య తెలిపారు. మండలంలోని బండమీదపల్లిలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. పంటలకు ఎక్కువ మోతాదులో యూ రియా వాడకూడదన్నారు. సాగు చేసిన ప్రతి పంటనూ ఈ క్రాప్ చే యించాలన్నారు. గంగలకుంటలో పొ లం పిలుస్తోంది నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు దగ్గుపాటి శ్రీనివాసులు, ఏఈఓ సుజిత పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి: జేడీఏ


పత్తిపంటను పరిశీలిస్తున్న జేడీఏ

గుత్తిరూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు సాగు చేసిన పంటలను ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేసుకోవాలని జేడీఏ ఉమామహేశ్వరీ సూచించారు. మండలంలోని జక్కలచెరువులో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. పత్తి పంటను పరిశీలించారు. మండలానికి 30 టన్నులు జిప్సం వచ్చిందన్నారు. ఆమె వెంట ఏడీఏ వెంకటరాముడు, ఏఓ ముస్తాక్ అహమ్మద్ ఏంపీఓలు ఉన్నారు.

అప్పులబాధతో లారీ డ్రైవర్ ఆత్మహత్య

గుత్తి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌బీఐ కాలనీలో నివాసముంటున్న లారీ డ్రైవర్ ఈశ్వర్‌రావు (48) అప్పులబాధ తాళలేక మంగళవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చిత్తూరు జిల్లా మదనపల్లికి చెందిన ఇతను 30 సంవత్సరాలుగా కుటుంబంతో గుత్తిలోనే నివాసముంటున్నాడు. ఆర్థిక పరిస్థితుల కారణంగా అనేక అప్పులు చేసి.. తీర్చలేక జీవితంపై విరక్తి చెందాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గుర్తించేవేళకు అతను మరణించాడు. వారు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది. ఈశ్వర్‌రావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మతిస్థిమితం లేని...

ఉరవకొండ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నముష్టూరు గ్రామ వాసి నరేంద్ర (45) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మతిస్థిమితం లేని ఈయన మద్యానికి బానిసయ్యాడు. సోమవారం రాత్రి ఇంటి సమీపంలోని ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం ఈ విషయాన్ని కుటుంబసభ్యులు, స్థానికులు గుర్తించారు. కేసు దర్యాప్తులో ఉంది. నరేంద్రకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

యాడికి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని నగరూరు గ్రామంలో ధనలక్ష్మి కుటుంబానికి.. సింహాద్రి, గోవిందు, రాజమ్మ కుటుంబాలకు మధ్య విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ధనలక్ష్మిపై సింహాద్రి, గోవిందు, రాజమ్మ దాడిచేసి గాయపరిచారు. ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు ఆ ముగ్గురిపై కేసు నమోదుచేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు.

ట్యాంక్‌ల నిర్మాణ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఏఈఈ

వజ్రకరూరు(ఉరవకొండ), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని ఎనిమిది గ్రామాల్లో జలజీవన్ క్రింద రూ.2.14 కోట్లతో ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంక్‌ల నిర్మాణం, పైప్‌లైన్, బోర్, పంప్‌సెట్ ఏర్పాటు పనులు చేస్తున్నట్లు ఏఈఈ మంజునాథ్ తెలిపారు. పొట్టిపాడు, కమలపాడులో ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంక్ నిర్మాణ పనులు ఆయన పరిశీలించారు.

నేటి నుంచి రిలే దీక్ష

బెళుగుప్ప, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయాలని మహిళా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నుంచి రిలే నిరాహారదీక్షలు చేపడుతున్నట్లు సంస్థ సంఘం సభ్యులు మంగళవారం తెలిపారు. సిబ్బంది ముత్తు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయకపోవడంతో సేవలన్నీ ఆగిపోయాయన్నారు.

యూరియా మంజూరు

విడపనకల్లు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలానికి 180 టన్నుల యూరియా మంజూరైందని, త్వరలో పంపిణీ చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏఓ హెచ్ పెన్నయ్య తెలిపారు. మండలంలోని హావళిగిలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇందులో ఏఈఓ కైలాష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి

గుత్తి రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీపురం గ్రామానికి చెందిన వీఆర్‌ఏ ఓబులేసు (58) అనారోగ్యంతో మంగళవారం మరణించాడు. కొంతకాలంగా కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన కోలుకోలేక మంగళవారం తెల్లవారుజామున మరణించాడు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో సెంటర్‌లోని స్కిల్‌హబ్ సెంటర్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ సర్వేయర్ కోర్సులపై నాలుగు నెలల పాటు ఉచితంగా శిక్షణా ఇస్తామని ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఆపై చదివిన విద్యార్థులు, నిరుద్యోగులు ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయండి

విడపనకల్లు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పలు వీధుల్లో మురుగు కాలువలు ఏర్పాటు చేయాలని డీపీఓ నాగరాజునాయుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో పర్యటించారు. వీధుల్లో చెత్త లేకుండా చూడాలన్నారు. ప్రజాప్రతినిధులు, గ్రామ కార్యదర్శులు సమన్వయంతో పంచాయతీ నిధులు ఎక్కడ అవసరమో అక్కడ ఖర్చు చేయాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంపీడీఓ సత్యబాబు, పంచాయతీ కార్యదర్శులు మహేష్, లోకేష్, సోమయ్య, సర్పంచ్‌లు చంద్రశేఖర్, తిమ్మరాజు, తిప్పారెడ్డి ఉన్నారు.


వీధిని పరిశీలిస్తున్న డీపీఓ

నమో జగన్మాత..!


గుంతకల్లు : మహాగౌరిగా కన్యకాపరమేశ్వరి


ఉరవకొండ : గాయత్రీదేవిగా భగళాముఖి అమ్మవారు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: దసరా శరన్నవ రాత్రులను పురస్కరించుకుని రెండో రోజైన మంగళవారం అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. గుంతకల్లులో కన్యకాపరమేశ్వరీ దేవి మహాగౌరిగా, ఉరవకొండలో బగళాముఖి అమ్మవారు గాయత్రిదేవిగా, రాయదుర్గంలో నగరేశ్వర కన్యకాపరమేశ్వరి లలితాదేవిగా, తాడిపత్రి బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతిదేవి బ్రహ్మచారిణిదేవిగా అలంకరించారు.


తాడిపత్రి : బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మచారిణిదేవిగా పార్వతిదేవి


రాయదుర్గం : లలితాదేవిగా నగరేశ్వర కన్యకాపరమేశ్వరి


విడపనకల్లు : బ్రహ్మచారిణి అలంకరణలో గౌరమ్మ


యాడికి : బాలాత్రిపుర సుందరిగా పెద్దమ్మతల్లి


పెద్దవడుగూరు: గాయత్రీదేవిగా చౌడేశ్వరి


గుత్తి : వాసవీమాతకు బఠానీ, రాజ్మా, బీన్స్ విత్తనాలతో అలంకరణ

జాబ్‌మేళాలో 149 మందికి ఉద్యోగాలు


నియామకపత్రాలతో అభ్యర్థులు, కంపెనీల ప్రతినిధులు

యాడికి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 149 మంది నిరుద్యోగులు ఉద్యోగాలు పొందినట్లు ప్రిన్సిపాల్ హరినాథ్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి జాబ్‌మేళాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీ-డాప్ ఆధ్వర్యంలో పది నేషనల్, మల్టీనేషనల్ కంపెనీలు ఈ జాబ్‌మేళాలో ఇంటర్వ్యూలు నిర్వహించాయన్నారు. జాబ్‌మేళాకు 266 మంది నిరుద్యోగులు హాజరుకాగా.. 149 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు.

జీఎస్టీ తగ్గింపు బోర్డులు ఏర్పాటు చేయాలి: ఎంపీ


మాట్లాడుతున్న ఎంపీ అంబికా

పామిడి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యాపార దుకాణంలో తగ్గిన జీఎస్టీ ధరల బోర్డులు ఏర్పాటు చేయాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. స్థానిక ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద మంగళవారం జీఎస్టీ తగ్గింపుపై పీఎం నరేంద్రమోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన ఆయన మాట్లాడారు. జీఎస్టీ తగ్గించి.. నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం పడకుండా పీఎం నరేంద్రమోడీ తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్ చౌదరి, గౌస్‌పీరా, అంజినాయక్, కుమారస్వామి, మనోజ్ కుమార్, నరేష్, పవన్‌కుమార్, బొమ్మా మోహన్‌కృష్ణ, జింకల సంజీవకుమార్ పాల్గొన్నారు.

శిక్షణకు అధికారులు, సర్పంచులు డుమ్మా


ఖాళీగా ఉన్న కుర్చీలు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ విజయభాస్కర్, డిప్యూటీ ఎంపీడీఓ దాస్ ఆధ్వర్యంలో పంచాయతీ పురోగతి సూచిక వెర్షన్ 1.0 శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. దీనికి 16 మంది ఎంపీటీలకు గాను కేవలం ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. పలువురు సర్పంచులు కూడా గైర్హాజరయ్యారు. గ్రామాల అభివృద్ధి పట్ల అధికారులు, సర్పంచుల నిర్లక్ష్యానికి ఇది నిదర్శనంగా నిలిచింది.

సమస్యలు పరిష్కరించండి


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో తిష్ట వేసిన పలు సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నాయకులు మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. వీధికుక్కల బెడద తప్పించాలని, రద్దీ ప్రాంతాల్లో మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని, డ్రైనేజీలలో పూడిక తొలగించాలని, ప్రధాన రహదారిలో డివైడర్లను ఏర్పాటు చేయాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు మహేష్, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సహాయ కార్యదర్శి ఎస్‌ఎండీ గౌస్,నాయకులు దేవేంద్ర, ఈశర్వయ్య, నాగేంద్ర ఉన్నారు.

వేడి నీటిలో పడి చిన్నారికి గాయాలు

బెళుగుప్ప, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామసాగరంలో అరుణ, మనోహర్ ల మూడేళ్ల కుమారుడు శ్యాం శరత్ మంగళవారం ప్రమాదవశాత్తు వేడి నీటిలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఆడుకుంటూ స్నానం కోసం కాచి ఉంచిన బకెట్లోకి పడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డ శరత్‌ను అనంతపురం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ఘనంగా గ్రామ దేవతల ఉత్సవం


కణేకల్లులో అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

కణేకల్లు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలో వెలసిన తాయమ్మ, మారెమ్మ దేవతల ఉత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు వేదావతి హగరిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి.. గ్రామంలో ఊరేగించారు. ఈ ఉత్సవాల్లో కాలవ భరత్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు.

గోదాము వద్ద కాంట్రాక్టర్ ఆందోళన


నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టర్

ఉరవకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డు ఆవరణంలోని పౌరసరఫరాల గోదాము వద్ద స్టేజ్-2 కాంట్రాక్టర్ నారాయణ స్వామి మంగళవారం ఆందోళన చేశారు. ఆయన మాట్లాడుతూ.. 'నేను గోదాము నుంచి స్టోర్ల కు నా లారీల ద్వారా సరుకులు సరఫరా చేసే కాంట్రాక్ట్ పొందాను. అయితే డీఎం రమేష్ రెడ్డి, స్టాక్‌పాయింట్ ఇన్‌చార్జి సుధాకర్ నాలుగు నెలలు నుంచి నాకు బిల్లులు మంజూరు చేయలేదు. అంతేకాకుండా కూలీలకు బిల్లులు చేసే విషయంలో పాస్‌వర్డ్ కూడా ఇవ్వకుండా వేధిస్తున్నారు. ప్రశ్నిస్తే కాంట్రాక్టు రద్దు చేస్తామని బెదిరిస్తున్నారు. సోమవారం గోదాము వద్ద నా లారీల్లోకి సరుకులను లోడ్ చేయించగా.. వాటిని ఆ అధికారులు తిరిగి అన్‌లోడ్ చేయించి.. గోదాంకు తాళాలు వేసుకొని వెళ్లిపోయారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా..' అని తెలిపారు. దీనికి స్టాక్‌పాయింట్ ఇన్‌చార్జి సుధాకర్‌ను వివరణ కోరగా.. నారాయణస్వామి సకాలంలో లారీలను గోదాము వద్దకు తీసుకొనిరావడం లేదని తెలిపారు.

చిన్నారులకు సామూహిక అన్నప్రాసన


సామూహిక అన్నప్రాసన చేస్తున్న అధికారులు

విడపనకల్లు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరు గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సమతుల్య ఆహారం-సంపూర్ణ ఆరోగ్యం అనే కార్యక్రమంలో భాగంగా 8వ రాష్ట్రీయ పోషణ మాస కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గర్భవతులు, బాలింతలు తీసుకోవల్సిన జాగ్రత్తలపై ఐసీడీఎస్ పీడీ నాగమణి అవగాహన కల్పించారు. గర్భవతులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్న ప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో సీడీపీఓ శ్రీదేవి, ఏసీడీపీఓ ఎల్లమ్మ, జిల్లా కో-ఆర్డినేటర్ రామ్మోహన్, ఎంపీపీ కరణం పుష్పావతి, సర్పంచ్ బ్యావులారాణి, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ


ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

ఉరవకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఈ నెల 21న నిర్వహించిన వెయిట్‌లిఫ్టింగ్ అండర్-14 బాలుర విభాగంలో మండలంలోని బూదగవి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు భరత్, రాజు కాంస్య పతకాలు సాధించినట్లు హెచ్‌ఎం విజయ్‌భాస్కర్ రెడ్డి మంగళవారం తెలిపారు. కాగా, పాఠశాలలో వాలీబాల్ పోల్స్ ఏర్పాటుకు బూదగవి వాసి నాగేంద్ర రూ. 6 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారన్నారు.

నేడు మెగా వైద్యశిబిరం

శెట్టూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ములకలేడు గ్రామంలో కళ్యాణదుర్గం శాసనసభ్యులు సురేంద్ర బాబు సహకారంతో బుధవారం కర్నూలు శ్రీచక్ర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నేతృత్వంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. ఇందులో కంటి, గుండె, కిడ్నీ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారన్నారు. పరీక్షల అనంతరం ఆపరేషన్ అవసరమయ్యే వారు ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డుతో వస్తే హాస్పిటల్ వారిని తీసుకెళ్లి ఆపరేషన్ చేసి పంపుతామన్నారు. అక్కడ పేషెంట్‌కు భోజన సదుపాయాలు కూడా కల్పిస్తామని, వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాంచో ఫెర్రర్‌తో జేసీపీఆర్ భేటీ

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్‌తో స్థానిక ఆర్డీటీ ప్రధాన కార్యాలయంలో తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ విషయంలో మాంచో ఫెర్రర్‌కి సంఘీభావం తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఆర్డీటీ సేవలు కొనసాగుతాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని చెప్పారు. మంత్రి నారా లోకేష్ చొరవతో ఆర్డీటీ సమస్య పరిష్కారమవుతుందని జేసీపీఆర్ తెలిపారు.

కొనసాగిన ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లోల 2,440, ఔట్ ఫ్లో 2,400 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు మంగళవారం తెలిపారు. ఫేజ్-2కు 1,890 క్యూసెక్కుల నీరు వెళ్తోందని తెలిపారు.